మిర్చి రైతుల అవస్థలు


మండలంలో సాగు చేసిన మిర్చి పంట

పంట అమ్మేందుకు పాట్లు
- గుంటూరు మార్కెట్‌కు పంట తరలింపు
- తెలంగాణ మిర్చిని కొనమని తిప్పి పంపించిన వైనం
- లాభాలొస్తాయని విస్తారంగా వేసిన రైతులు
- మండలంలో 500 ఎకరాల్లో మిర్చిసాగు


గుంటూరు మార్కెట్‌లో గుడెబల్లూర్ రైతుకు చెందిన మిర్చిలోడ్‌తో ఉన్న వాహనం

కృష్ణా: పండించిన పంటను అమ్ముకోవడానికి, సరైన గిట్టుబాటు ధర వస్తుందని ఆశించి తెలంగాణ రైతులు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు మార్కెట్‌కు మిర్చిని తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లిన తరువాత ఆంధ్రప్రదేశ్‌లోని మార్కెట్ వారు, అక్కడి పోలీసుల సహాయంతో తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి తీసుకెళ్లిన మిర్చి వాహనాలను తిప్పి పంపించారు. తెలంగాణలో పండిన మిర్చిని తాము కొనడం లేదని బహిరంగంగా రైతులకు చెప్పి వాహనాలను వెనక్కి పంపించారు. ఈ ప్రాంతంలో మిర్చిని అమ్ముకోవడానికి సరైన మార్కెట్ లేకపోవడంతో గిట్టుబాటు ధర వస్తుందని ఆశించి వెళ్లిన రైతులకు చివరకు నిరాశ మిగిలింది. దీంతో పాటు వాహన కర్చులు తమకు భారంగా మారాయని రైతులు వాపోతున్నారు. మండలంలోని గుడెబల్లూర్ గ్రామానికి చెందిన రైతు గత రెండు రోజుల క్రితం గుంటూర్‌లోని ఎన్‌టీఆర్ మిర్చి మార్కెట్‌కు వెళ్లి తిరిగి రావడంతో విషయం బయటకు వచ్చింది. మండలంలోని మిగితా రైతులు మిర్చి పంటను అమ్ముకునేందుకు ఆంధ్రకు తీసుకెళ్ల వద్దంటూ, అక్కడ తెలంగాణ రైతుల పంట కొనడం లేదని పేర్కొన్నాడు. పక్కన ఉన్న రాయచూర్‌లోనే వచ్చిన ధరకు విక్రయించుకోవాల్సి వచ్చింది.

వాణిజ్య పంటలకు వాతావరణం అనుకూలం

దక్షణ తెలంగాణ, ఉత్తర కర్ణాటక ప్రాంతాలు వాణిజ్య పంటలకు, పండ్ల తోటలకు అనుకూలమైన వాతావరణం ఉంటుంది. ఈ వాతావరణం మిర్చి, పత్తి, మామిడి, దానిమ్మ, అంజూరు, అరటి, పామాయిల్ తోటలకు అనుకూలంగా ఉంటుంది. మాగనూర్, కృష్ణా ఉమ్మడి మండలాల్లో 50 శాతం రైతులు పత్తి, 30 శాతం మంది వరి, 20శాతం మంది మిర్చిని సాగు చేస్తున్నారు. కృష్ణా మండలంలో దాదాపు 500 ఎకరాల్లో ఎప్పుడు లేనంతగా ఈ ఏడాది మిర్చి సాగును చేశారు. 186 మంది రైతులు 660 ఎకరాల్లో వివిధ పండ్ల తోటలు పెంచుతున్నట్లు ఉద్యానవన శాఖవారు పేర్కొన్నారు. వ్యవసాయంలో వస్తున్న మార్పులు రైతులకు లాభాలు అందించకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు.

❒ పత్తి సాగులో నష్టం ఉంటుంది, కాని మిర్చిలో నష్టం ఉండదని గత కొంత కాలంగా రైతులు చెబుతూ వచ్చారు. మిర్చికి పెట్టబడి తక్కువగా ఉండడంతో పాటు గతంలో లాభాలు అధికంగా వచ్చాయి. అలాగే ఎకరాకు 20 క్వింటాళ్ల మిర్చిని పండించిన రైతులు ఈ ప్రాంతంలో ఉన్నారు. దీంతో రైతులు అధిక దిగుబడులు వస్తున్నాయని ఆశించి మిర్చి పంటను సాగు చేశారు. తీర వాతావరణం అనుకూలించకపోవడం, వర్షాలు అధికంగా పడడంతో మిర్చిపంటకు రోగాలు వచ్చి దిగుబడి తగ్గింది. పండించిన పంటను అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

> **పూర్తిగా తక్కువ ధరలు ఉండడంతో..**
>
> 
>
> గుడెబల్లూర్ గ్రామంలో 5 ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశాను. కొంత వరకు స్థానిక మార్కెట్‌లోనే అమ్ముకున్నాను. రాయచూర్ మార్కెట్‌లో పూర్తిగా తక్కువ ధరలు ఉండడంతో 8 క్వింటాళ్ల మిర్చిని గుంటూర్‌లో ఎన్‌టీఆర్ మార్కెట్‌కు తీసుకెళ్లాను. అక్కడ వాహనాల నెంబర్‌ప్లేట్ చూసి ఇవి తెలంగాణ, కర్ణాటక నుంచి వచ్చాయని, వాటిని మేము కొనడం లేదని తిప్పి పంపించారు. ఇక చేసేది ఏమీ లేక తిరిగి వచ్చాం.
>
> – మహదేవ్, రైతు, గుడెబల్లూర్

క్లుప్తంగా

హెచ్‌సీయూ భూముల అమ్మకం సరికాదు



మాగనూర్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణకు తరలివెళ్లకుండా మండలంలో ఎస్ఎఫ్ఐ నాయకులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విశ్వవిద్యాలయ భూముల విక్రయ నిర్ణయాన్ని విరమించుకుని, అరెస్ట్ చేసిన విద్యార్థి నాయకులను బేషరుతుగా విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సూర్యప్రకాష్, అంబ్రేష్, నాయూం, తదితరులు ఉన్నారు.

నర్వ: హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని ప్రభుత్వం వెంటనే ఉప సంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మహేందర్ అన్నారు. నర్వ పోలీసులు విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో జిల్లా నాయకులు బీసమొళ్ళ నాగరాజు, తదితరులు ఉన్నారు.

పీడీఎస్‌యూ నాయకుల ముందస్తు అరెస్ట్



నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని పీడీఎస్‌యూ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. పీడీఎస్‌యూ నాయకులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలో ఉన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, విద్యార్థి సంఘాల నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ, ఇతర వామపక్ష సంఘాల ఆధ్వర్యంలో చలో సచివాలయం చేపట్టగా వారిని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడు గౌస్, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



మరికల్: అర్ధరాత్రి సమయంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. మండలంలోని ఎలిగండ్ల మన్నేవాగు నుంచి బార్ల రాములుగౌడ్, వడ్డే గురులు కొన్నాళ్లుగా అధికారుల అనుమతి లేకుండా పోలీసుల కళ్లు గప్పి వాగు నుంచి అర్ధరాత్రి సమయంలో మరికల్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాలకు ఇసుకను తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు నిఘా పెట్టి బుధవారం రాత్రి రెండు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాము తెలిపారు.

విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేత



మరికల్: మండలంలోని గాజులయ్యతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం మదనపల్లి ఉపాధ్యాయురాలు సహదేవిగౌడ్ విద్యార్థులకు మిల్టన్ స్టీల్ వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్లాస్టిక్ బాటిళ్ల వల్ల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. వాటి స్థానంలో మిల్టర్ స్టీల్ వాటర్ బాటిళ్లు అందజేయడంతో వారి ఆరోగ్యం కాపాడిన వారమవుతామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మయ్య, నవీన్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటిన కన్నప్పకు సన్మానం



నారాయణపేట ఎడ్యుకేషన్: ఇటీవల ఢిల్లీలో జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలో టీ–44 క్యాటగిరిలో లాంగ్ జంప్‌లో 5.30 మీటర్లు దూకి బ్రాంజ్ పథకం సాధించి నారాయణపేట జిల్లా పేరును జాతీయ స్థాయిలో చాటి చెప్పిన దామరగిద్దకు చెందిన కన్నప్పను జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్ ప్రధాన కార్యదర్శి రమణ మాట్లాడారు. విద్యార్థులు, యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఖేలో ఇండియా అథ్లెటిక్స్ కోచ్ హారిక దేవి, పీఈటీ అంబ్రేస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బోలుబండ.. దాతృత్వం నిండా


పాథర్చేడ్‌లో అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

నర్వ: ప్రతి ఏటా వేసవి తాపాన్ని తీర్చేందుకు అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న బోలుబండ కుటుంబాన్ని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అభినందించారు. గురువారం పాథర్చేడ్ గ్రామంలో బోలుబండ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని కలెక్టర్ రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామ ప్రజలకు, అధికారులకు, నాయకులకు అంబలి గ్లాస్‌లను అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత 17 ఏళ్లుగా అంబలి కేంద్రం ద్వారా గ్రామస్తులకు, అటు రహదారి ప్రయాణికుల వేసవి తాపాన్ని తీర్చుతున్న 'బోలుబండ.. దాతృత్వం నిండా' అంటూ ప్రశంసించారు. అనంతరం కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో దాత విశ్రాంత జీహెచ్ఎం బోలుబండ సంజన్న, తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీఓ శ్రీనువాసులు, ఎస్ఐ కురుమయ్య, ఎంపీఓ రాఘవేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


వీరభద్రేశ్వరుడికి నందికోళ్ల సేవ

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి గ్రామంలో వెలసిని భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గత మంగళవారం అంకురార్పణతో ప్రారంభమైన ఉత్సవాలు, బుధవారం రాత్రి పల్లకీ సేవ, నందికోళ్ల సేవ, అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. గురువారం డోలారోహణం, మహారథోత్సవం, పూజలు చేపట్టారు. శుక్రవారం రుద్రాభిషేకం, అఖండ హారతి కార్యక్రమాలతో జాతర ఉత్సవాలు కొనసాగనున్నాయి. బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావ్ నామాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్‌లు బ్రహ్మోత్సవాలకు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ


నిడ్జింతలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఆర్డీఓ రాంచందర్, నాయకులు


తిరుమలాపూర్‌లో బియ్యం పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

కొత్తపల్లి: మండలంలోని నిడ్జింత గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం నారాయణపేట ఆర్డీఓ రాంచందర్ ప్రారంభించారు. లబ్ధిదారులు సన్నబియ్యం పక్కదారి పట్టకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోస్గి ఏఎంసీ చైర్మన్ భీములు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్ పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్: అన్ని వర్గాల ప్రజలను సమాంతరంగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం సదాశివరెడ్డి అన్నారు. మండలంలోని కోటకొండ, తిరుమలాపూర్ గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, రెవెన్యూ అధికారి గోపాల్, నర్సిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి చాణిక్య రెడ్డి, కోట్ల మధుసూదన్ రెడ్డి, శంకర్, రాజు, ప్రభంజన్, సుధాకర్ బాబు, నర్సింహులు, రాజిరెడ్డి పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని టేకులపల్లిలో సన్నబియ్యం పంపిణీ పథకాన్ని మక్తల్ మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కట్ట సురేష్, నాయకులు పాల్గొన్నారు.

❒ ఊట్కూరు మండలంలోని కొల్లూరులో ఆర్ఐ కృష్ణారెడ్డి సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నారాయణపేట: జిల్లా కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షులు భరత్ కుమార్, బీజేపీ పట్టణ అధ్యక్షులు పోషల్ వినోద్‌లు మాట్లాడారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అటవీ భూములను సీఎం రేవంత్‌రెడ్డి డెవలప్‌మెంట్ పేరిట 1500 ఎకరాల హెచ్‌యూ అడవి భూముల్లో 400 ఎకరాలను వేలంపాట వేసి అమ్మి వేసే ప్రక్రియలో భాగంగా జేసీబీలు, బుల్డోజర్లతో చెట్లను తొలగించే చర్య చేపట్టడం ప్రకృతి విరుద్ధమన్నారు. దీనికి నిరసనగా నారాయణపేట జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దాహనం చేశామన్నారు. బీజేవైఎం నాయకులు శ్రీనివాస్ కమలాపూర్, మోహన్, మణిశంకర్ పళ్ళ రఘు, మణి, చేతన్, మని మోడీ, శశాంక్, అజయ్, శివచందర్ పాల్గొన్నారు.

కొత్తపల్లి అమ్మాయికి గ్రూప్‌-1 ఉద్యోగం



కొత్తపల్లి: ఎలాంటి కోచింగ్ లేకుండా తాతగారి(రిటైర్డ్ టీచర్) పర్యవేక్షణలో కష్టపడి చదివి ఓ అమ్మాయి గ్రూప్–1 ఉద్యోగం సాధించింది. కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన నందిని బీఎస్సీ, బీఈడీ చేసింది. ప్రభుత్వం ప్రకటించిన అన్ని నోటిఫికేషన్లను అటెండ్ చేస్తూ ప్రస్తుతం గ్రూప్–4లో ఉద్యోగం సాధించి మహబూబ్‌నగర్‌లోని కమర్షికల్ టాక్స్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. గతంలో భూత్పూర్ గురుకుల ఉపాధ్యాయురాలిగా పనిచేసింది. దీంతో పాటు గ్రూప్–3, గ్రూప్–2 ఫలితాల్లో ఉద్యోగాలు సాధించింది. తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్–1లో మల్టీజోన్‌లో 152 ర్యాంకు, రాష్ట్రంలో 281 ర్యాంకు సాధించింది. ప్రస్తుతం గ్రూప్–1 ఉద్యోగం రావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఉద్యోగం ద్వారా మన ప్రాంతానికి సేవ చేయడానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొంది.

చెరువు నీటిని రక్షించాలని వినతి

దామరగిద్ద: మండలంలోని కందెన్‌పల్లి గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ తన వరి పంట కోసం చెరువులో నీటిని తోడేస్తూ పశువులకు నీరు లేకుండా చేస్తున్నారని గ్రామానికి చెందిన నగేష్ గురువారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చెరువు తన పట్టాభూమిలో ఉందని, చెరువు నీటిని గ్రామస్తులు ఎవరూ వినియోగించుకునే వీలు లేదని హుకుం జారీ చేస్తూ దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. చెరువు నీటిని తోడేయడం నిలిపి వేసవిలో చెరువు నీరు పశువులకు ఉపయోగ పడేలా చర్యలు తీసుకోవాలని కోరాడు.

రెండోరోజు సామూహిక యజ్ఞాలు

మరికల్: మండలంలోని అప్పంపల్లి ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో రెండోరోజు గురువారం 499 శివరామకోటి జప, గీతాజ్ఞాన యజ్ఞాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో రోజు 15 మంది దంపతులతో సదానంద యోగీశ్వరులు, రఘునాథపూర్, బ్రహ్మచారిలు సామూహిక యజ్ఞాలు చేయించారు. రాత్రి రాధాకృష్ణ కల్యాణం, భగద్గీత పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

నారాయణపేట రూరల్: పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులై స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేష్ కుమార్, ఉపాధ్యాయులు సుజాత, నమ్రత, సౌజన్య, ఉషారాణి, అమల, విజయ, షమీనా, తిరుపతి, ఉదయ్ పాల్గొన్నారు.



పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



మాగనూర్‌లో పండుగలపై ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసిన ఎస్ఐ అశోక్‌బాబు

మాగనూర్: మండలంలోని వివిధ గ్రామాల పెద్దలు, యువకులతో మాగనూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ అశోక్‌బాబు ఆధ్వర్యంలో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పండుగలు శ్రీరామనవమి, హనుమాన్ జయంతి సందర్భంగా ప్రజలకు భద్రతాపరమైన సూచనలు చేశారు. ప్రజలు తమ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదని, డీజేలు ఉపయోగిస్తే అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ర్యాలీలు, శోభాయాత్రలు నిర్వహిస్తే ముందస్తు పోలీస్ పర్మిషన్ తీసుకోవాలని, పర్మిషన్ తీసుకుంటే బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, తిమ్మప్ప, అశోక్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే కృషి

నర్వ: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌కు ప్రహరీ నిర్మాణాని కృషి చేసిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని కాంగ్రెస్ మండల నాయకులు శరణప్ప తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యేకు వినతి చేయగా, వెంటనే స్పందించి గురువారం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు ప్రహరీ నిర్మాణం కోసం కొలతలు తీసుకున్నారు. పనుల ఎస్టిమేషన్ పూర్తి కాగానే త్వరలో నిధులు మంజూరు చేసి పనులు చేపడుతామని అధికారులు పేర్కొన్నారు. ప్రహరీ నిర్మాణ పనుల కోసం నిధులు మంజూరయ్యేలా కృషి చేసిన ఎమ్మెల్యేకు అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఎం.కురుమూర్తి, శరణప్ప, కట్టరాములు, డా.శంకర్, సాయన్న, ఆనంద్ మాత్రే, పెద్దమారన్న, శ్రీనివాసులు, రాములు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి


హెచ్‌సీయూను ముట్టడిస్తున్న ఏబీవీపీ నాయకులు

నారాయణపేట ఎడ్యుకేషన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విషయంలో ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నరేష్ అన్నారు. ఈ మేరకు ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నారాయణపేట జిల్లా ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ముట్టడించారు. కార్యక్రమంలో నరేష్ మాట్లాడుతూ... హెచ్‌సీయూలోని భూముల అమ్మకానికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులపై ప్రభుత్వం విచక్షణ మరిచి అమానుషంగా దాడి చేసి, వారిపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడం సరైందికాదన్నారు. హెచ్‌సీయూ ప్రాంతంలో అడవులు హైదరాబాద్ నగరానికి ఆక్సిజన్ అందిస్తున్నాయని, అలాంటి వాటిని ప్రభుత్వం వేలం వేసి కార్పొరేట్ శక్తులకు అమ్మడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఇంతియాజ్, చరణ్, వివేకానంద రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్, నగర కార్యదర్శి సతీష్, అర్జున్, శివప్రసాద్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూములు కాపాడాలని నిరసన

మరికల్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడాలని ఏబీవీపీ నాయకులు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఏబీవీపీ శాఖ పిలుపు మేరకు హైదరాబాద్‌కు తరలివెళ్తున్న ఏబీవీపీ నాయకులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

విద్యార్థుల విమాన ప్రయాణం


విమాన ప్రయాణం కోసం గ్రామం నుంచి వెళ్తున్న విద్యార్థులు

మరికల్: గతేడాది నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఓ ప్రైవేట్ ట్రస్ట్ సంస్థ అధినేత తన సొంత ఖర్చులతో విమాన ప్రయాణం కోసం తీసుకెళ్లడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని చిత్తనూర్ గ్రామానికి చెందిన గుంటికాడి రాణి ప్రైవేట్ ఉద్యోగి. గూగుల్ ట్విట్టర్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఆమె గ్రామానికి చెందిన పేద విద్యార్థులు 5, 6వ తరగతి నవోదయ ప్రవేశ పరీక్షలకు గతేడాది తన సొంత ఖర్చులతో 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇప్పించారు. ఫలితాల్లో 6 మంది విద్యార్థులు అర్హత సాధించారు. వారిని గురువారం తాను స్థాపించిన ట్రస్ట్ ద్వారా తొలి విమాన ప్రయాణ అనుభవం కోసం హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయానికి తీసుకెళ్లడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోవాలి

ధన్వాడ: రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తులు చేసుకున్న ప్రతి ఒక్కరు మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీఓ సాయి ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులతో పాటు సంబంధించిన ధ్రువ పత్రాలను అందజేయాలని, వివరాలకు కార్యాలయంలో సందర్శించాలని తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



నారాయణపేట: జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో ఎస్ఐ రేవతి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పేట పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులకు బ్రీత్ అనలైజర్‌తో డ్రంకెన్ కండిషన్ తనిఖీ చేసి 5 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. పోలీసులు, వాహనదారులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



మద్దూరు: మండలంలోని దమగ్నాపూర్ నుంచి దామరగిద్ద మండలంలోని లక్ష్మీపూర్ వరకు ఎస్‌డీఎఫ్ రూ.3.90 కోట్లతో గురువారం కోస్గి ఏఎంసీ చైర్మన్ భీములు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహులు బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు. పీఆర్ అధికారులు రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, నాయకులు ఇబ్రహీం, కాశప్ప, సుదర్శన్, సాయప్ప, ముస్తాఫా పాల్గొన్నారు.

'జర్నలిస్టులకు ఇంటి స్థలం ఇస్తాం'



నారాయణపేట: నూతన తెలుగు సంవత్సరం (ఉగాది) రోజున తీపి కబురు చెబుతానని మాట ఇచ్చి, నియోజకవర్గంలో వివిధ పత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియాలో పని చేస్తున్న ప్రతి జర్నలిస్టు సంక్షేమానికి కృషి చేస్తానని, పేట జర్నలిస్టులకు 133 గజాల ఇంటి స్థలాన్ని సొంత నిధులతో ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో వివిధ పత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులతో ఆయన మాట్లాడారు. త్వరలోనే వెంచర్‌ను ఏర్పాటు చేసి ఇంటి స్థలాలను ఇవ్వబోతున్నామన్నారు. నియోజకవర్గంలో చదువుకు దూరమైన విద్యార్థుల ఉన్నత విద్య కోసం, పేదల వైద్యానికి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, దేవాలయాల్లో నీటి బోర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రెస్‌క్లబ్‌కు టీవీ కుర్చీల అందజేత

జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌కు భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్ఈడీ టీవీ, కుర్చీలు, ఫ్యాన్లు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షులు నారాయణరెడ్డి, టీయూడబ్ల్యూజే హెచ్–143 జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌గౌడ్, ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు లొట్టి శ్రీను, పలువురు జర్నలిస్టులు, ఫౌండేషన్ సభ్యులు మధుసూదన్ రెడ్డి, రుద్రారెడ్డి, తిప్పన్న, శివరాజ్, నరసింహనాయుడు, వై.సంతోష్, హనుమంతు, అశోక్, నందకుమార్, చామకూర నగేష్ పాల్గొన్నారు.

'స్థలం కేటాయించాలని పంచాయతీ కార్యదర్శికి వినతి'

ధన్వాడ: మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని కోరుతూ గురువారం పూలే విద్యాభివృద్ధి సంఘం అధ్యక్షులు రాఘవేందర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి జడల బాలరాజులు ధన్వాడ పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. నర్సింహులు నాయుడు, వెంకటేష్, నర్సింహులు, లక్ష్మన్న, కురుమన్న, రవికుమార్ పాల్గొన్నారు.